



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 22.12.2025 | సంపుటి : 2 | సంచిక :317 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 22.12.2025 | volume : 2 | Issue : 317 | Pages : 8 | Cost : 2/- |


# రాష్ట్రపతి భవన్‌లో తేనీటి విందు

**గవర్నర్, సీఎం సహా పలువురు ప్రముఖుల హాజరు**

**ఆతిథ్యమిచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

**హైదరాబాద్, డిసెంబర్ 21:** బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం సాయంత్రం 'ఎట్ హోం' కార్యక్రమం నిర్వహించారు. శీతాకాల విడిది కోసం ఈ నెల 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తేనీటి విందుతో ఆతిథ్యమిచ్చారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, సీఎం సలహాదారు

మిగతా 2 లో



# కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

## కేసీఆర్ వస్తానంటే జనవరి 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం

## కృష్ణా, గోదావరి జలాలపై రెండేసి రోజులు చర్చిద్దాం

- కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు చాలంటూ ఆయన చేసిన సంతకం తెలంగాణకు మరణశాసనం
- మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. జనవరి 2వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, కృష్ణా జాలాలపై ఒక రోజు, గోదావరి జలాలపై మరో రోజు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆదివారం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ స్పందించారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. తెలంగాణకు ద్రోహం చేసింది కేసీఆరేనన్నారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయలేదని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఆయనే దెబ్బ తీశారన్నారు. కేసీఆర్ వస్తే ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను చూపిస్తామన్నారు. కృష్ణా జలాల్లో 36 శాతం వాటా అంగీకరించింది కేసీఆర్ మాత్రమేనని, 71 శాతం వాటా కోసం తాము పోరాడుతున్నామన్నారు.



**హైదరాబాద్, డిసెంబర్ 21:** 'జనవరి 2న సభకు వస్తానని కేసీఆర్ చెప్పకపోయినా... జనవరిలో అసెంబ్లీ శీతాకాల సమావేశాల ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో చర్చించి తేదీలు నిర్ణయిస్తాం. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై చర్చించాలని కేసీఆర్‌ను అడుగుతుంటే బహిరంగ సభలకు వెళ్తానంటున్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేతలా శాసనసభకు వచ్చి చర్చించాలని కేసీఆర్‌ను మేం ఆహ్వానిస్తున్నాం. సభలో ఆయన గౌరవమర్యాదలకు ఎలాంటి భంగం కలగకుండా చూసే బాధ్యత మాది. ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సభాపతికి విన్నవిస్తాను. నీళ్ల-నిజాలపై ఎవరేం చేశారనేది సభావేదికగా ముఖాముఖి చర్చిద్దాం. కేసీఆర్ తన అనుభవంతో రాష్ట్రానికి ఉపయోగపడే ఏ సూచన చేసినా ప్రభుత్వం ఆమోదిస్తుంది. కేసీఆర్‌కు

మిగతా 2 లో

'క్రమ పద్ధతిలో ముందుకు సాగుతున్న రాష్ట్రంలో ప్రజలను అబద్ధపు హామీలతో మోసగించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మాయమాటలతో అర్రాజ్ పాటలు పాడి చాంతాడంత హామీలు ఇవ్వడంతో ప్రజలు టెంప్ట్ అయ్యారు. వంద శాతం సమ్మిళిత అభివృద్ధితో ముందుకు సాగుతున్న తెలంగాణలో బాండు పేపర్లు, గ్యారంటీ కార్డులు అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలకు శఠగోపం పెట్టారు. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం. నదుల అనుసంధానం పేరిట గోదావరి జలదోపిడీ, పాలమూరు ఎత్తిపోతలకు అన్యాయం జరుగుతున్నా స్పందించడం లేదు. కిరికిరి మాటలతో, కారు కూతలతో ప్రభుత్వం నడుపుతామంటే కుదరదు.

**హైదరాబాద్, డిసెంబర్ 21:** మాది తెలంగాణ తెచ్చిన పార్టీ. ప్రధాన ప్రతిపక్షంగా మా విధి మేము నిర్వర్తించాలి. సర్కారుకు సరిపడినంత సమయం ఇచ్చాం. ఇవాళ్టి వరకు వేరు, రేపటి నుంచి వేరే.. తోలు తీస్తాం.. అందుకోసం నేను రంగంలోకి దిగుతున్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు భారీ ప్రజా ఉద్యమానికి

మిగతా 2 లో



# నదుల అనుసంధానం పేరిట జల దోపిడీ

## పాలమూరు ఎత్తిపోతలకు అన్యాయం జరుగుతున్నా స్పందించడం లేదు

- రెండేళ్లుగా 'పాలమూరు'లో తట్టెడు మట్టి తీయకుండా ఎవరు అడ్డుకుంటున్నారు?
- చంద్రబాబు ఒత్తిడితోనే ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వాపస్ పంపింది
- కాంగ్రెస్ ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ దందా, కమీషన్లు కొట్టడం తప్ప వేరే పనిలేదా?
- సరిపడా సమయం ఇచ్చాం.. తెలంగాణ హక్కులకు ఒక్క నొక్కు పడినా సహించం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టేందుకు త్వరలో కార్యాచరణ.. భారీ ప్రజా ఉద్యమం
- జిల్లాల్లో బహిరంగ సభలు.. నేను స్వయంగా హాజరవుతా..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫైర్




# నేడు సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

**కొలువుదీరనున్న పాలక మండళ్లు**

**పంచాయతీలకు 'కొత్త' కళ**

**హైదరాబాద్, డిసెంబర్ 21:** రాష్ట్రంలో కొత్త సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ ప్రమాణస్వీకారం సోమవారం జరగనుంది. ఈ మేరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. 1,205 ఏకగ్రీవాలతోపాటు

మిగతా 2 లో



02

## రైల్వే ఛార్జీల పెంపు..

ఈనెల 26 నుంచి అమల్లోకి..

## 'వీబీ-జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ ' (వీబీ-జీ రామ్ జీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

02



02

## కాంగ్రెస్.. జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతోంది

ప్రధాని మోదీ

## ఎస్ఎల్‌బీసీ, దిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు?

**కేసీఆర్ పదేళ్ల పాలనలోనే రాష్ట్రానికి అన్యాయం**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 21:** పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. పాలమూరు, ఎస్ఎల్‌బీసీ, దిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని తెలంగాణ నీటిపారుదలశాఖ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి కేసీఆర్ చేసిన విమర్శలపై మంత్రి ఉత్తమ్ స్పందించారు. "పాలమూరు, దిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజలు కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో అవాస్తవాలు చెప్పడం పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌కు తగదు.

మిగతా 2 లో





02

## కోడలితో అక్రమ సంబంధం

సుపారి గ్యాంగ్‌తో కుమారుడిని హత్య చేయించిన తండ్రి



# రాష్ట్రపతి భవన్‌లో తేనీటి విందు

(మొదటిపేజీ తరువాయి)

వేం నరేందర్‌రెడ్డి, భాజపా ఎంపీ ఈటల రాజేందర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి, మండలి ఛైర్మన్, శాసనసభ స్పీకర్, మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా రాష్ట్రపతికి పరిచయం చేశారు. సీఎంతో పాటు హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో రాష్ట్రపతి కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రపతి నిలయం నిర్వహణ, సందర్శకులను బాగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అతిథులకు నోరూరించే వంటకాలు వడ్డించారు.

# ఎస్‌ఎల్‌బీసీ, దిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు?

(మొదటిపేజీ తరువాయి)

రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చినా.. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. కృష్ణా జలాలు కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా ముందుకెళ్తోంది. కృష్ణా జలాల విషయంలో పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసింది కేసీఆరే. రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కారణం కేసీఆర్. కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇప్పుడు ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నారు. కాళేశ్వరం నిర్మాణ తీరును నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుబట్టారు. కమీషన్ల కోసమే ఆ ప్రాజెక్టు అంచనాలు పెంచారు" అని మంత్రి ఉత్తమ్ విమర్శనాస్త్రాలు సంధించారు.

# రైల్వే ఛార్జీల పెంపు..

## ఈనెల 26 నుంచి అమల్లోకి..

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21 :** టికెట్ ధరలను పెంచుతూ భారతీయ రైల్వేశాఖ ప్రకటన చేసింది. ఇవి డిసెంబరు 26 నుంచి అమల్లోకి రానున్నాయి. పెరుగుతున్న ఖర్చులను బ్యాలెన్స్ చేస్తూనే.. ఎక్కువ మంది ప్రయాణికులకు రైల్వే సేవలను చేరువ చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. తాజా మార్పుల ప్రకారం.. లోకల్, స్వల్ప దూర ప్రయాణాల టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఆర్డినరీ క్లాస్‌లో 215 కి.మీల కంటే తక్కువ దూరం ప్రయాణికులకు ఎలాంటి ఛార్జీలు పెంచలేదు. అంతకంటే ఎక్కువ దూరం వెళ్లే.. ఆర్డినరీ క్లాస్ రైలు టికెట్ ధర కిలోమీటరకు 1 పైసా చొప్పన పెంచింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్ ఏసీ, నాన్-ఏసీ రైళ్లలో కిలోమీటరకు 2 పైసలు చొప్పున ఛార్జీలు పెంచింది. ఇక నాన్-ఏసీ ట్రైన్‌లో 500 కి.మీ దూరం ప్రయాణించే వారు అదనంగా రూ.10 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 26 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులతో రైల్వేకు దాదాపు రూ.600 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరుతుందని రైల్వేశాఖ అంచనా వేస్తోంది.




# కోడలితో అక్రమ సంబంధం..

## సుపారి గ్యాంగ్‌తో కుమారుడిని హత్య చేయించిన తండ్రి

**కరీంనగర్ :** కోడలితో ఉన్న అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని తండ్రే.. సుపారీ ఇచ్చి కుమారుడిని హత్య చేయించిన ఘటన కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకుంది. హత్య అనంతరం మిగిలిన సుపారీ డబ్బుల కోసం నిందితులంతా ఒకే చోటుకు చేరడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన అంజయ్య (36)కు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అంజయ్య తన పొలం పనులు చూసుకుంటూ.. ఉపాధి నిమిత్తం 2017 విదేశాలకు వెళ్లి తిరిగి 2019లో స్వగ్రామానికి వచ్చాడు. ఇంటికి వచ్చినప్పటి నుంచి తండ్రి లచ్చయ్య, తన భార్య సాన్నిహిత్యాన్ని గమనించి అంజయ్య ఇద్దరినీ మందలించాడు. ప్రవర్తన మార్చుకోవాలని తన హెచ్చరించాడు. అయినా వారిలో ఎలాంటి మార్పూ రాలేదు. ఇదే విషయాన్ని కొందరి బంధువుల వద్ద చెప్పుకొని బాధపడ్డాడు. అక్రమ సంబంధానికి కుమారుడు అడ్డువస్తున్నాడని భావించిన లచ్చయ్య, కోడలితో కలిసి మూడు నెలల కిందట ఓ మంత్రగాడి వద్దకు వెళ్లి మందు పెట్టి చంపాలని నిర్ణయించుకున్నారు. ఒక వేళ అంజయ్య అనారోగ్యానికి గురైతే అతనికి సేవ చేయాల్సి వస్తుందని భావించి ఆ పథకం విరమించుకున్నారు. నెల రోజుల క్రితం లచ్చయ్య తనకు తెలిసిన మధ్యవర్తి అయిన కొలిపాక రవితో.. అంజయ్యను హత్య చేయాలని చెప్పాడు. రవి తనకు తెలిసిన ఉప్పరపల్లి కోటేశ్వర్, అతని స్నేహితుడు మహ్మద్ అబ్రార్‌తో రూ.3 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. వాయిదాల పద్ధతిలో లచ్చయ్య రూ.1.25 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. నెల రోజుల నుంచి కోటేశ్వర్, అబ్రార్‌లు అంజయ్యతో పరిచయం పెంచుకొని రోజూ మద్యం సేవించేవారు. ఈనెల 2న కోటేశ్వర్, అబ్రార్, రవిలు అంజయ్యను ఊరి శివారులోని కెనాల్ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించారు. తరువాత గొంతు నులిమి చంపి మృతదేహాన్ని కెనాల్‌లో పడేశారు. అంజయ్య కనిపించడం లేదని భార్య, తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 5న అంజయ్య మృతదేహాన్ని కాలువలో గుర్తించారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయి మృతి చెందినట్టు నిందితులు నమ్మించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు. సుపారీ కింద మిగిలిన రూ.1.75లక్షలు తీసుకోవడానికి నిందితులు లచ్చయ్య ఇంటికి రాగా.. పోలీసులు వారి కదలికలను గుర్తించి పట్టుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితులైన తండ్రి లచ్చయ్య, అంజయ్య భార్య, కోటేశ్వర్, అబ్రార్, రవిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

# కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వంతపాడేవారితో చర్చలకు సిద్ధంగా లేం. సభకు రాని కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ఉండాలా వద్దా అనేది భారాస నిర్ణయించుకోవాలి. ఆయన ఆరోగ్యం ఎలా ఉందని భారాస ఎంపీలను మోదీ అడగగానే కేసీఆర్‌కు ఉత్సాహం వచ్చింది. లోక్‌సభ ఎన్నికలు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత ప్రతిపక్ష నేత హోదా గుర్తుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో పనులు చేయించుకోవడానికే దిల్లీకి వెళుతున్నా. కేంద్రంతో మాట్లాడటం వల్లే కేసీఆర్ గతంలో అధిక వడ్డీలకు తెచ్చిన రూ.26 వేల కోట్ల అప్పులను తీర్చేందుకు అనుమతి ఇచ్చింది. అధిక వడ్డీలపై తెచ్చిన మరో రూ.85 వేల కోట్ల అప్పులను తీర్చడానికి తక్కువ వడ్డీకి రుణాలను పొందేందుకు అనుమతించాలని ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాను. తక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి, అధిక వడ్డీలకు తెచ్చినవాటిని కట్టేస్తే ఏటా రూ.4 వేల కోట్ల ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నాం. కేసీఆర్ రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేశారు. 12% వడ్డీలకు అప్పులు తెచ్చి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు.

### కుమారుడు, అల్లుడు కొట్లాడుకుంటున్నారు...

కేసీఆర్‌కు ఆయన కుటుంబం నుంచే ప్రమాదం పొంచి ఉంది. కుమారుడు కేసీఆర్ కుర్చీ కోసం, అల్లుడు ఆస్తుల కోసం కొట్లాడుకుంటున్నారు. అల్లుడి చేతిలోకి పార్టీ పోతుందన్న భయంతోనే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చారు. కేసీఆర్ ఉన్నంతకాలం హరీశ్ రావు ఎక్కడికీ పోరు. పార్టీతో పాటు పార్టీ ఆస్తులపై ఆయన కన్నేశారు. కానీ, భారాసను కేటీఆర్ చేతిలో పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. నేను కోటి మంది మహిళలకు చీర, సారె ఇచ్చి గౌరవిస్తే కేసీఆర్ కుటుంబం మాత్రం కవితను పార్టీ నుంచి బయటకు పంపింది.

### కేసీఆర్ పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం

కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే మహబూబ్‌నగర్ జిల్లా. కృష్ణా జలాల్లో వాటా కోసమే తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి



పడింది. సమైక్య రాష్ట్రంలో కంటే కేసీఆరే తన పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం చేశారు. ఆయన హయాంలోనే ఏపీ జలదోపిడీ జరిగింది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాగా 299 టీఎంసీలు చాలని ఆయన సంతకాలు పెట్టి.... ఉమ్మడి పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు మరణశాసనం రాశారు. కృష్ణా జలాలపై ఏపీకి శాశ్వతంగా హక్కులు రాసిచ్చారు. అందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. కృష్ణా నది తెలంగాణలోకి ప్రవేశించే జూరాల నుంచి కాకుండా బాగా దిగువన ఉన్న శ్రీశైలంపై నుంచి పాలమూరు-రంగారెడ్డికి నీళ్లు తీసుకోవాలనే ప్రణాళికతో అన్యాయం చేశారు. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి లాంటి ప్రాజెక్టులను ఏపీ నిర్మించుకున్నా పట్టించుకోలేదు. గోదావరి జలాలను అటు ఇచ్ఛాపురం వరకూ, ఇటు నాయుడుపేట, రాయలసీమలకు తరలించుకుపోవాలంటూ చంద్రబాబుకు సలహా ఇస్తూ... పట్టిసీమను కట్టినందుకు అభినందిస్తూ కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన వీడియో ఉంది. భారాస సభలు పెట్టే ప్రతి ఊర్లోనూ దాన్ని ప్రజల ముందు ప్రదర్శిస్తాం.

### ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే అధిక నీటి వినియోగం

భారాస పాలనలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టి, వాటిలో రూ.1.80 లక్షల కోట్ల బిల్లులు చెల్లించారు. అయినా పదేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదాన్నీ భారాస ప్రభుత్వం పూర్తి చేయలేదు. వాటిని పూర్తి చేసిఉంటే తెలంగాణకు కృష్ణా జలాల్లో అధికంగా నీటిని వాడుకునే అవకాశం దక్కి ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులపై రూ.6,800 కోట్లు ఖర్చు చేశాం.

### కాంట్రాక్టులు, కమీషన్లకు అమ్ముడుపోయారు

భారాస ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌ను సరిగా రూపొందించకపోవడంతోనే కేంద్రం వెనక్కి పంపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని ఎన్‌జీటీలో కేసులు వేసిన బీరం హర్షవర్ధన్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కొల్లాపూర్ టికెట్ ఇచ్చారు. కృష్ణా జలాల్లో ఏపీకి 64%, తెలంగాణకు 36% వాటా ఇస్తే చాలని కేసీఆర్ సంతకం చేసి... కాంట్రాక్టులు, కమీషన్లకు అమ్ముడుపోయారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా నది పరీవాహక ప్రాంతం లెక్కల ప్రకారం నదీ జలాల్లో 71% వాటా కావాలని పోరాడుతున్నాం. కేసీఆర్ 50% కూడా అడగలేదు. మొత్తం 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు నెగ్గారు. నిజనిర్ధారణ కమిటీ వేసి ఏ గ్రామానికైనా వెళ్లి పరిశీలిద్దాం. ఏ పార్టీ మద్దతుదారులు సర్పంచులుగా గెలిచారో తేలుద్దాం. యూరియా కోసం యాప్‌ను ప్రవేశపెట్టి అధునాతన టెక్నాలజీని వాడతామని చెపితే కేసీఆర్ భరించలేకపోతున్నారు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# 'వీబీ-జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21 :** 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గతంలో 100 రోజుల పని హామీ కల్పించిన మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) స్థానంలో దీనిని తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన శీతాకాల సమావేశాల్లో విపక్షాల నిరసనల నడుమే ఈ బిల్లు ఉభయసభల ఆమోదం పొందింది. తగినంత సమయం ఇవ్వకుండా హడావుడిగా బిల్లులకు ఆమోదం తెలపడం అప్రజాస్వామికమంటూ విపక్షాలు ఉభయసభల్లోనూ నిరసన తెలిపాయి. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా) చట్టాన్ని రద్దుచేయడం సరికాదంటూ ఆందోళన చేపట్టాయి. లోక్‌సభలో స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి బిల్లు ప్రతుల్ని చించి విసిరేశాయి. రూ.10-11 లక్షల కోట్లను కేవలం కూలీలకిచ్చే వేతనాలపై ఖర్చుపెట్టడం కాకుండా శాశ్వత ఆస్తుల్ని సమకూర్చాలనే ఉద్దేశంతో, ఎంతో లోతుగా చర్చించాకే బిల్లు తయారుచేశామని కేంద్ర మంత్రి చౌహాన్ విపక్షాలకు వివరణ ఇచ్చారు.

# కాంగ్రెస్.. జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతోంది : ప్రధాని మోదీ



**దిబ్రుగఢ్:** విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ పార్టీ జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వస్తున్న వలసదారులు అస్సాంలో స్థిరపడేందుకు సహకరిస్తోందని విమర్శించారు. అస్సాంలోని దిబ్రుగఢ్ జిల్లాలో రూ.10,601 కోట్లతో నిర్మించిన ఎరువుల తయారీ కర్మాగారాన్ని మోదీ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతోనే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆరోపిం చారు. బంగ్లాదేశ్ వలసదారులకు అస్సాంలో ఆశ్రయం కల్పించడం ద్వారా కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును పెంచుకోవాలనే ఉద్దేశంతో ఉందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజల గుర్తింపు, ఉనికి, ఆత్మగౌరవం గురించి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం పట్టింపు లేదని మండిపడ్డారు. "ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డుకునేందుకు కాంగ్రెస్ అడుగడుగునా ప్రయత్ని స్తోంది. నేనేం మంచి చేయాలనుకున్నా.. దానికి మోకాలడ్డుతోంది. ప్రజల గౌరవం, ఉనికిని కాపాడేందుకు భాజపా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల నుంచి అస్సాంను కచ్చితంగా రక్షించాల్సిన అవసరం ఉంది. అందుకు భాజపా ఓ రక్షణ కవచంలా నిలుస్తుంది" అని మోదీ తెలిపారు.



# నేడు సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

11,497 ఎన్నికలు జరిగిన పంచాయతీ స్థానాలు కలిపి మొత్తం 12,702 మంది సర్పంచులు కొత్తగా ఎన్నికయ్యారు. వార్డు సభ్యుల్లో 25,848 మంది ఏకగ్రీవం కాగా 85,955 వార్డులకు ఎన్నికలు జరిగాయి. మొత్తంగా 1,11,803 మంది వార్డు సభ్యులుగా గెలిచారు. మూడు విడతల వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం 12,702 మంది ఉప సర్పంచులను ఎన్నుకున్నారు. ఈ నెల 22న వారందరి ప్రమాణస్వీకారానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీనికి అనుగుణంగా అధికారులు సన్నాహాలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నమూనాలో వారి ప్రమాణ-స్వీకారాలు జరగనున్నాయి. అనంతరం కొత్త సర్పంచులకు ప్రత్యేకాధికారులు బాధ్యతలను అప్పగిస్తారు.

# నదుల అనుసంధానం పేరిట జల దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకారం చుడుతున్నాం. మూడు నాలుగు రోజుల్లో ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లా నేతలతో సమావేశమై గ్రామ గ్రామాన డప్పు కొట్టి కార్యాచరణ ప్రకటిస్తాం. ఆయా జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించి నేను స్వయంగా హాజరవుతా..' అని భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షులు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గం, శాసనసభా పక్షం, పార్లమెంటరీ పార్టీ, ఇతర కీలక నేతలతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తట్టెడు మట్టి తీయకుండా రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిష్క్రియా పరత్వం, కేంద్రం వ్యతిరేకిస్తున్న తీరును రెండేళ్లుగా గమనిస్తున్నాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదు. తెలంగాణ ప్రజల కోసమే పుట్టిన బీఆర్ఎస్..తెలంగాణ హక్కులకు ఒక్క నొక్కు పడినా, ఒక్క చుక్క నష్టం జరిగినా సహించేది లేదు.

### తెలంగాణకు శనిలా బీజేపీ

కేంద్రంలో ఎన్‌డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ఒత్తిడితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను వెనక్కి పంపారు. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర ప్రధాన అనుమతులు సాధించినా బీజేపీ దిగజారి తెలంగాణకు శనిలా మారింది. మూడు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ప్రాజెక్టు డీపీఆర్‌ను వెనక్కి పంపి ఆగం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందన లేకుండా పెదవులు మూసుకుంది. మైనర్ ఇరిగేషన్ నష్టాలు, ఏపీ పట్టిసీమ ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాల తరలింపుతో కృష్ణాలో తెలంగాణకు దక్కిన 45 టీఎంసీలను కలుపుకొని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90.81 టీఎంసీలు కేటాయించాం. కానీ నీటిపారుదల శాఖ మంత్రి 45 టీఎంసీలు చాలని లేఖ రాశారు. గోదావరి జలాల తరలింపుతో కృష్ణాలో ఏపీ వదులుకున్న జలాలను ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర వాడుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం నిద్రపోతోంది. రెండేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులో తట్టెడు మట్టెడు తీయకుండా ఎవరు అడ్డుకుంటున్నారు? ఈ ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ దందా, కమీషన్లు కొట్టడం తప్ప వేరే పనిలేదా?..' అని కేసీఆర్ మండిపడ్డారు.

### మేం పెండింగు ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం..

'సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఉమ్మడి మహబూ



బ్‌నగర్ జిల్లా కోలుకోలేని రీతిలో దెబ్బతింది. నాటి సీఎం చంద్రబాబు జిల్లాను దత్తత తీసుకున్నా జూరాలలో ముంపునకు గురైన కర్ణాటక భూమికి రూ.13కోట్లు పరిహారం ఇవ్వలేదు. గోదావరి నదిపై దేవునూరు, ఇచ్చంపల్లి తదితర ప్రాజెక్టులకు ఉమ్మడి ఏపీలో అన్యాయం చేసిన రీతిలోనే కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాకు నష్టం చేశారు. 17 టీఎంసీలతో మంజూరైన జూరాల ప్రాజెక్టు దశాబ్దాల తరబడి కనీసం ఫౌండేషన్‌కు నోచుకోలేదు. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత.. చంద్రబాబు మోకాళ్ల మీద పరుగెత్తి పరిహారం చెల్లించడంతో జూరాల ప్రాజెక్టు ఆయకట్టు సాగులోకి వచ్చింది. రాజోలిబండ మళ్లింపు పథకం కోసం ఆలంపూర్, గద్వాల వరకు పాదయాత్ర చేశా. మహబూబ్‌నగర్ జిల్లాలో 308 కిలోమీటర్ల మేర కృష్ణా ప్రవహిస్తున్నా నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి తదితర పథకాలను పెండింగులో పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. పాలమూరు ఎత్తిపోతల పథకానికి 170కి పైగా టీఎంసీలు తీసుకోవాలనే వ్యూహంతో తొలుత 90.81 టీఎంసీలు కేటాయించాం. అనేక అవాంతరాలు ఎదురైనా అనుమతులు సాధించాం. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేశాం..' అని బీఆర్ఎస్ అధినేత వెల్లడించారు.

### హైప్ క్రియేట్ చేయడంలో గురువు చంద్రబాబు

'బిజినెస్ మీట్‌ల పేరిట హైప్ క్రియేట్ చేయడంలో గురువు చంద్రబాబు. ఏపీలో చంద్రబాబు హోటల్‌లో పనిచేసే వంట మనుషులతో ఎంఓయూలపై సంతకాలు పెట్టించారు. ఆయన చెప్పిన లెక్కలు నిజమైతే ఈ పాటికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేవి. ఒప్పందాలు నిజమైతే కనీసం రూ.10 వేల కోట్లయినా రావాలి కదా. గతంలో నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు భోపాల్‌కు వెళ్లిన సందర్భంలో ప్రధాని మోదీ సమక్షంలో కుదిరిన రూ.14 లక్షల కోట్ల ఎంఓయూలు బోగస్ అని ఆ రాష్ట్ర మంత్రి చెప్పారు. పెట్టుబడులపై అబద్ధపు ప్రకటనలు, ఒప్పందాలతో ప్రజలను మోసం చేయడం ఎందుకు?..' అని కేసీఆర్ ప్రశ్నించారు.

### ఫ్యూచర్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ దందా

'ఫార్మా రంగానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని కాలుష్య రహిత ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ముచ్చర్లలో మేం 14 వేల ఎకరాలు సేకరించాం. పర్యావరణ అనుమతులు కూడా సాధించి ముందుకు సాగుతున్న క్రమంలో ప్రభుత్వం మారింది. కానీ ఫ్యూచర్ సిటీ పేరిట భూములను అమ్ముకునేందుకు రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందాకు తెరలేపారు. గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రాణాలను కాపాడలేని ప్రభుత్వం ఫార్మాసిటీ భూములను అమ్ముకునేందుకు ఉత్సాహం చూపుతోంది. వంతారాకు 3 వేల ఎకరాలు, జూపార్కు తరలింపు భూముల అమ్మకం కోసమేనా? గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ ప్రజలను ఎంత కాలం వంచిస్తారు? యాప్ ద్వారా యూరియా అంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. మేము ప్రజల ఆస్తుల విలువ పెంచితే ప్రస్తుతం భూముల ధరలు కుప్పకూలాయి. అడ్డమైన హామీలు ఇచ్చి రైతులు, పేదలు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులను ఏడిపిస్తున్నారు. సందర్భం ఏదైనా కేసీఆర్ చనిపోవాలి అంటూ మాట్లాడటం కరెక్టేనా?..' అని కేసీఆర్ నిలదీశారు.

సైబర్ నేరం ఎప్పుడు.. ఎక్కడ జరిగినా పోలీసులకు ప్రథమంగా చిక్కేవి ఈ మ్యూల్ ఖాతాల వివరాలే. దర్యాప్తు సంస్థలకు చిక్కుతున్న నిందితుల్లో చాలామంది మ్యూల్ ఖాతాలు ఇచ్చినవారే. కమీషన్లకు ఆశపడి కొందరు.. తెలిసిన వ్యక్తులు అడిగారని ఇంకొందరు బ్యాంకు ఖాతాలు అడ్డగోలుగా ఇచ్చేస్తున్నారు. చివరకు పోలీసులకు చిక్కి లబోదిబోమంటున్నారు. సీబీఐ గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 700 బ్యాంకు శాఖల్లో 8.5 లక్షల మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు గుర్తించారు. ఆర్బీఐ ప్రారంభించిన మ్యూల్ హంటర్ టూల్ ప్రతినెలా 20 వేల ఖాతాలను గుర్తిస్తోంది. వాస్తవానికి ఇంతకుమించి కొన్ని లక్షల్లో మ్యూల్ అకౌంట్లు ఉన్నాయని అంచనా. ఇది కమీషన్లకు ఆశపడేవారికి.. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన వ్యవహారమని మనం అనుకోవడానికి వీల్లేదు. తెలిసో.. తెలియకో బ్యాంకు ఖాతాలున్నవారిలో చాలామంది మ్యూల్స్‌గా మారిపోతున్నారు.

సైబర్ మోసాలు చేసేందుకు నేరగాళ్లు.. ప్రజల నుంచి కొట్టేసిన డబ్బుతో లావాదేవీలు చేసేందుకు తమ పేరుతో ఉండే బ్యాంకు ఖాతాలకు బదులు ఇతరులవి ఉపయోగిస్తుంటారు. పోలీసులు బ్యాంకు ఖాతా వివరాలు, లావాదేవీల ఆధారంగా తమ ఉనికిని గుర్తించి అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో.. నేరగాళ్ల పన్నే పన్నాగం ఇది. ఒకరి పేరుతో ఉన్న ఖాతాలను.. ఇంకొకరు నేరం కోసం వినియోగించడాన్నే మ్యూల్ ఖాతాలు అంటారు. ఈ మ్యూల్ ఖాతాల్లోనూ రెండు రకాలు. సైబర్ నేరగాళ్ల సాధారణ ప్రజలకు కమీషన్ ఇచ్చి.. వారి ఖాతాలు ఉపయోగించడం ఒకటి. ఇతరులకు తెలియకుండా వారి గుర్తింపు పత్రాలతో ఖాతాలు తెరిచి లావాదేవీలు నిర్వహించడం ఇంకో సమస్య.





# మ్యూల్ ఖాతాల అలజడి

## మీ ఖాతా ఎవరు వాడుతున్నారో తెలుసా?

### ఏం జరుగుతోంది..?

మూడేళ్లుగా సైబర్ నేరాలు పెరగడం.. మోసగాళ్లు చిక్కకపోవడానికి ప్రధాన కారణం మ్యూల్ అకౌంట్లని తేలింది. బ్యాంకు ఖాతాలు తెరిచిన వెంటనే, హఠాత్తుగా భారీ మొత్తంలో నగదు జమ, విత్‌డ్రా అవడంపై బ్యాంకులు నిఘా పెంచాయి. ఆకస్మికంగా డబ్బు జమయితే వాటిని అనుమానాస్పద ఖాతాలుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చేవి. ఈ ఖాతాల మీద నిఘా పెరగడంతో.. సైబర్ నేరగాళ్లు కొత్త పంథా ఎంచుకున్నారు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన మ్యూల్ ఖాతాలను వ్యవస్థీకృతంగా దేశవ్యాప్తంగా విస్తరించారు. చిన్న మొత్తాల్లో జరిగే మోసాల కోసం సేవింగ్స్ ఖాతాలు, పెద్ద మొత్తంలో జరిగే మోసాల కోసం కరెంటు ఖాతాలు ఉపయోగించడం మొదలుపెట్టారు. టెలిగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా నిరుద్యోగులు, గృహిణులు, వివిధ వర్గాలను సంప్రదిస్తున్నారు. చిన్న చితకా పనులు చేసుకునేవారి వివరాలతో కరెంటు ఖాతాలు తీస్తున్నారు. వాస్తవానికి కరెంటు ఖాతాలు తెరవాలంటే వ్యాపార సంస్థ ఉండాలి. నిర్ణీత మొత్తంలో వ్యాపారం జరిగినట్లు ఆధారాలు, జీఎస్టీ నంబరు వంటివి తప్పనిసరి. ఇవేవీ లేకుండా మధ్యవర్తులు, కమీషన్ ఏజెంట్ల ద్వారా బ్యాంకు సిబ్బందిని ప్రలోభపెడుతున్నారు. ఖాతాలు తెరిచి యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. సేవింగ్స్ ఖాతాల కోసం చిరుద్యోగులు, నిరుద్యోగులకు వలేస్తున్నారు. ఒక సైబర్ నేరంపై దర్యాప్తు చేస్తున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఒక బ్యాంకు శాఖలో ఆరు కరెంటు ఖాతాల వివరాలు చిక్కాయి. వీటిలో నెలల వ్యవధిలోనే రూ.175 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. ఖాతాదారులు ఇద్దరు ఆటోడ్రైవర్లని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు కమీషన్ ఆశచూపి కొందరు ఈ ఖాతాలు తెరిపించారని.. తాము ఖాతాలు ఉపయోగించడం లేదని చెప్పారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా బ్యాంకు మేనేజర్ పాత్ర కూడా తేలడంతో అరెస్టు చేశారు.




### తెలియని ఖాతాల నుంచి డబ్బు జమైతే

- స్నేహితులు, ఇతర వ్యక్తులు లావాదేవీల కోసం బ్యాంకు ఖాతా వివరాలు అడిగినప్పుడు ఇస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో అవతలి వ్యక్తులు సైబర్ నేరాల ద్వారా కొట్టేసిన డబ్బు జమ చేయించడానికి వాడే అవకాశాలున్నాయి.
- పోలీసులు సైబర్ నేరాల మీద దర్యాప్తు చేసినప్పుడు డబ్బు జమైన బ్యాంకు ఖాతాదారుడినే ప్రశ్నిస్తారు. తమకు సంబంధం లేదని చెబితే కుదరదు. లావాదేవీతో సంబంధంలేకున్నా చట్టపరమైన ప్రక్రియను ఎదుర్కోవాల్సిందే.
- పరిచయం లేని, అసలే మాత్రం సంబంధం లేని వ్యక్తుల ఖాతాలు, యూపీఐ యాప్‌ల (ఫోన్‌పే, జీపే తదితరాలు) నుంచి నగదు జమవుతుంటుంది. ఇలా జమయ్యే డబ్బు సైబర్ నేరగాళ్లు పంపి ఉండొచ్చు. గుర్తుతెలియని ఖాతాల నుంచి డబ్బు జమైతే.. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దు.
- సంబంధిత బ్యాంకును, అవసరమైతే పోలీసులను సంప్రదించాలి. లేకపోతే సైబర్ నేరంలో పాత్ర కింద బ్యాంకు ఖాతాను 'ఫ్రీజ్' చేస్తారు. దీనివల్ల ఖాతాలో సొంత సొమ్మునూ తీసుకునేందుకు వీలుండదు.

## ఆరెస్సెస్‌ను రాజకీయ కోణంలో చూడడం తప్పు : మోహన్ భాగవత్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21 :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను రాజకీయ కోణంలో చూడడం అతిపెద్ద తప్పుగా సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. భాజపాతో ఆర్ఎస్ఎస్‌ను పోల్చడం, రాజకీయ కోణంలో చూడడంతో ప్రజల్లో తరచు అపార్థాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా కోల్‌కతాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు సామాజిక బాధ్యత కలిగిన సంఘ్‌సేవక్‌లను సృష్టించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని, బలమైన దేశాన్ని నిర్మించడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి తమ అభిప్రాయం చెప్పే హక్కు దేశంలోని ప్రతివ్యక్తికీ ఉందని, కానీ అది వాస్తవికత ఆధారంగా ఉండాలని భాగవత్ అన్నారు. సంఘ్‌కు ఎటువంటి రాజకీయ అజెండా లేదని.. దేశమే తొలి ప్రాధాన్యం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తమ కార్యకర్తలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సంఘ్ చేస్తున్న ఈ కృషితో భారత్ మళ్లీ విశ్వగురువుగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## జెనీవాలోని భారత శాశ్వత మిషన్‌లో అధికారి చేతివాటం

### రూ.2 కోట్లు దుర్వినియోగం

**జెనీవా :** జెనీవాలో ఉన్న భారత శాశ్వత కమిషన్‌లోని ఓ అధికారి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిసింది. అక్కడ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తించిన ఆ అధికారి చేతివాటం ప్రదర్శించి దాదాపు 2లక్షలకుపైగా స్విస్ ఫ్రాంక్ (సుమారు రూ.2కోట్లు)లను సొంత ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. దీంతో అతడిపై సీబీఐ కేసు నమోదు చేసింది. జెనీవాలో ఉన్న భారత శాశ్వత కమిషన్‌లో మోహిత్ అనే అధికారి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా గతేడాది డిసెంబర్‌లో చేరారు. భారత కార్యాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌లో అకౌంట్లు ఉన్నాయి. ఆ లావాదేవీల నిర్వహణ బాధ్యతలు అతడికి అప్పగించారు. చెల్లింపుల కోసం క్యూఆర్ కోడ్‌లను ఉపయోగిస్తుండగా.. అందులో కొన్ని నకిలీ కోడ్‌లను సృష్టించిన మోహిత్ సొంత ఖాతాలకు మళ్లించినట్లు తెలిసింది. ఏడాది కాలంలో మొత్తంగా రూ.2 కోట్లకుపైగా దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారం గురించి అధికారులు ప్రశ్నించగా.. చేసిన మోసాన్ని మోహిత్ అంగీకరించాడు. ఆ నిధులను క్రిప్టో గ్యాంబ్లింగ్ కార్యకలాపాలకు మళ్లించినట్లు పేర్కొన్నాడు. దీంతో అతడిని కుటుంబంతో సహా భారత్‌కు పంపించారు. నేరపూరిత ద్రోహం, ఫోర్జరీ, ఖాతాలు దుర్వినియోగం, అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన సీబీఐ దర్యాప్తు చేపట్టింది.

## దక్షిణాఫ్రికాలో కాల్పులు.. 9 మంది మృతి

**జొహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికాలో ఓ సాయుధుడు జరిపిన కాల్పుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం జొహన్నెస్‌బర్గ్ శివారులోని బెకర్స్ డాల్ టౌన్‌షిప్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. కాల్పుల చప్పుడుతో భయాందోళనకు గురైన ప్రజలు పరుగులు తీశారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. కాల్పులకు కచ్చితమైన కారణం తెలియరాలేదన్నారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తాజా కాల్పుల నేపథ్యంలో ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఈ నెల 6న ప్రిటోరియా సమీపంలో కూడా కాల్పులు చోటు చేసుకొన్నాయి. ఈ ఘటనలో మూడేళ్ల చిన్నారితో సహా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.



## నాయకత్వ మార్పు అంశం.. హైకమాండ్‌పై నిందలా? : ఖర్గే

**న్యూఢిల్లీ, డిసెంబర్ 21 :** కర్ణాటకలో నాయకత్వ మార్పుపై గత కొన్ని రోజులుగా జోరుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై హైకమాండ్ ఎలాంటి గందరగోళం సృష్టించలేదని, స్థానిక స్థాయిలోనే సమస్య ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానంపై నిందలు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కలబురగిలో విలేకరులతో మాట్లాడుతూ.. హై కమాండ్‌పై నిందలు వేయడం కంటే అంతర్గత వివాదాలకు స్థానిక నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల్లో తమ వల్లే పార్టీ విజయం సాధించిందని కొందరు ప్రకటించుకోవడంపై ఖర్గే సీరియస్ అయ్యారు. "పార్టీ నిర్మాణంలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉంది. ఒక్కరి కృషి వల్లే జరగలేదు. కార్యకర్తలే మనకు మద్దతుగా నిలిచారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. నాయకులు వ్యక్తిగతంగా గొప్పలు చెప్పుకోవడం మానేసి కార్యకర్తల సమష్టి కృషిని గుర్తించాలన్నారు. పార్టీ అధిష్టానాన్ని కలిసేందుకు డీకే శివకుమార్ దిల్లీ వెళ్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఈ విషయంపై తనకు సమాచారం లేదన్నారు. సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల



మధ్య అధికార పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడంలో పార్టీ హైకమాండ్ తనకు మద్దతుగా నిలుస్తుందన్న విశ్వాసం ఉందని సిద్ధరామయ్య పేర్కొనడం, మరోవైపు డీకే కూడా దిల్లీ పర్యటనకు సిద్ధమైన వేళ ఖర్గే వ్యాఖ్యలు కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## హాదీ అంత్యక్రియల్లో.. యూనస్ కీలక వ్యాఖ్యలు

**బంగ్లాదేశ్ :** భారత వ్యతిరేకి, ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ ఆదర్శాలను ముందుకు తీసుకెళ్తామని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. అతడి అంత్యక్రియల్లో పాల్గొన్న యూనస్.. అక్కడున్న వేలాది మందిని ఉద్దేశించి ప్రసంగించారు. 'ఉస్మాన్ హాదీ.. మీకు వీడ్కోలు చెప్పేందుకు ఇక్కడకు రాలేదు. బంగ్లాదేశ్ ఉన్నంత కాలం.. ఈ దేశ ప్రజలందరి హృదయాల్లో ఉంటారు. అక్కడి నుంచి నిన్ను ఎవరూ తొలగించలేరు. నువ్వు మాకు చెప్పిన మాటను నెరవేరుస్తామని ప్రమాణం చేస్తున్నా. దేశ ప్రజలందరూ మీ ఆదర్శాలను కొనసాగిస్తారు' అని అన్నారు. హాదీ ప్రేమ, మానవత్వం, ప్రజలతో కలిసిపోయే విధానాన్ని యూనస్ ప్రశంసించారు. ఈ దేశం మరచిపోలేనీ మంత్రాన్ని హాదీ తమకు ఇచ్చారని.. అది ఎప్పటికీ తమ చెవుల్లో ప్రతిధ్వనిస్తోందన్నారు. ప్రపంచం ముందు బంగ్లా తలెత్తుకుని ఉంటుందని.. ఎవరి వద్ద తలవంచదని వ్యాఖ్యానించారు. ఈ సందరరేగా ఎన్నికల్లో పాల్గొనాలనే హాదీ అకాంక్ష గురించి యూనస్ ప్రస్తావించారు. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీని గద్దె దింపేందుకు గతేడాది విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో హాదీ కీలక పాత్ర పోషించాడు. ఈనెల ఆరంభంలో గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై దాడి చేశారు. దీంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హాదీ మృతితో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. శనివారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య అతడి అంత్యక్రియలు జరిగాయి.



## ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన రెడ్ల రేపాక కాంగ్రెస్ సర్పంచ్ దేశబోయిన బాలస్వామి యాదవ్

**వలిగొండ. రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన దేశబోయిన బాలస్వామి యాదవ్ ఆదివారం రోజు భువనగిరి క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి బోకే అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భూక్య భీమా నాయక్, వలిగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, మాద సర్పంచ్ మాద లావణ్య శంకర్ గౌడ్, మండల నాయకులు ఎండి జానీ పాషా, పంతంగి శ్రీనివాస్,దంతూరి రవిశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## అయ్యప్ప స్వామి ఇరుముడి పూజా

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని బీహెచ్ఈఎల్ అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుడు మాద్రి ప ృథ్విరాజ్ పాల్గొని స్వాముల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పృథ్విరాజ్ మాట్లాడుతూ శబరి యాత్రకు బయలుదేరుతున్న స్వాముల యాత్ర నిర్విఘ్నంగా ఆనందంగా సాగాలని అయ్యప్ప స్వామి కృపతో అందరికీ ఆరోగ్యం శాంతి శుభ ఫలితాలు కలగాలని ఆకాంక్షించారు. భక్తి నమ్మకం సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందం కలిగిస్తుందని పృథ్వీరాజ్ అన్నారు.



## నర్సాపురం నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జక్కుల వెంకటయ్య

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సాపురం గ్రామంలో నూతన గౌరవ అధ్యక్షులు వేల్పుల యాదమల్లయ్య కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని గ్రామ ప్రజలకు అందిస్తాం ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా సహకరిస్తూ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన ఏ సమస్య వచ్చిన నేను ముందుండి సమస్య పరిష్కారం చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావటి మత్స్యగిరి, ఉపాధ్యక్షుడు కూరెళ్ల దేవేందర్, యూత్ అధ్యక్షుడు కావటి రమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు గండు నరేష్, కావటి లింగస్వామి, మంటిపల్లి సుధాకర్, పీసర వెంకటరెడ్డి, బుంగపట్ల నరహరి, ఎనుగుల ఉప్పలయ్య, నార్కెట్పల్లి సంజీవ, కావటి బిక్షం, కుమార్, జాంగిర్, రామకృష్ణ, నవీను, రాజు, మత్స్యగిరి, శ్రావణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## గోసంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

### పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్ లోని బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి గోశాల 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ తో కలిసి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మాట్లాడుతూ గోసంరక్షణ అందరి బాధ్యత అని గోసంరక్షణకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని గోదారిత వ్యవసాయం జరిగినప్పుడు ప్రజలందరూ ఎలాంటి రోగాలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారని అందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా గోసంరక్షణకు పాటుపడాలని గూడెం మైపాల్ రెడ్డి అన్నారు.




## సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం

**వాజేడు,రాజముద్ర న్యూస్:** ఓడ బలిజ సేవా సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు చింతూరు వెంకటరావు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య ఆధ్వర్యంలో ఓడ బలిజ సర్పంచ్ ఉప సర్పంచ్ లను వార్డ్ మెంబర్ లను ఆదివారం సాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఓడబలిజ సేవా సంఘం అధ్యక్షులు ఉద్దేశించి మాట్లాడుతూ... భవిష్యత్తులో కూడా ఈ ఐక్యతను కొనసాగించాలని రాబోయే ఎన్నికలను జడ్పిటిసి, ఎంపిటిసి లను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అవకాశం ఉన్నచోట పొత్తులు పెట్టుకొని లేని చోట ఐక్యతను చాటి ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర సీనియర్ నాయకులు ముఖ్య సలహాదారులు తోట మల్లికార్జునరావు, వాజేడు మండలం అధికార ప్రతినిధి బొల్లె ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, చర్ల మండల అధ్యక్షులు ఎర్రావుల ప్రేమ్ మామార్, తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు కొలువుదీరునున్న ఐదేళ్ల పాలకవర్గం

- సర్పంచ్‌తో పాలకవర్గానికి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసిన అధికారులు
- గ్రామపంచాయతీ కార్యాలయాలకు కలరింగ్ రిపేర్ పనులు చేసిన గ్రామ పంచాయతీ సిబ్బంది




**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తికావడంతో కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలు నేడు కొలువుదీరనున్నాయి. దీంతో బీర్కూర్ మండలంలోని మొత్తం 13 గ్రామ పంచాయతీలలో 13 మంది నూతన సర్పంచులే గెలుపొందారు. ఇందులో యువ సర్పంచులు కూడా ఉన్నారు. దీంతో మండలంలో కొన్ని గ్రామపంచాయతీలో గ్రామ పంచాయతీ కార్యాలయాలకు రిపేర్లు క్లీనింగ్ రంగులు వేశారు. కొత్త పాలకవర్గాలు కొలువుదీరేందుకు ప్రభుత్వం ఎలాంటి పన్ను కేటాయించినప్పటికీ కొన్నిచోట్ల గ్రామపంచాయతీలోని జనరల్ ఫండ్స్ ద్వారా మరికొన్ని చోట్ల నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ సొంత నిధులతో బిల్డింగ్ లకు రంగులు వేయడం కిటికీలు డోర్లకు ఫ్యాన్లు లైట్ల రిపేరింగ్ పనులు చేపట్టారు. కొన్నిచోట్ల కొత్తగా ఎన్నికైన సర్పంచులు తమకు అనుగుణంగా వాస్తు మార్పులు సైతం చేయించుకుం టున్నారు. వాస్తు మార్పుల్లో భాగంగా భావనాల కిటికీలు ధ్వజరాలను సొంత ఖర్చులతో మార్చుకుంటున్నారు. రెండేళ్లు పాలకవర్గం లేక నిరాదరాగనకు గురైన పంచాయతీ బిల్డిం గులు ప్రస్తుతం కొత్త హంగులను సంతరించుకుంటున్నాయి. ప్రమాణ స్వీకారానికి కావలసిన పత్రాలను ఇతర ఏర్పాట్లను ఒకరోజు ముందే అధికారులు రెడీ చేసుకున్నారు. ఇదిలా ఉండగా గతంలో సర్పంచ్ గా కొనసాగిన వారు తమ సొంత డబ్బులతో కొన్ని పెట్టుకున్నామని చెప్పి గ్రామపంచాయతీ భవనాలు ఉన్న కుర్చీలు ఇతర సామాగ్రిని తీసుకెళ్లినట్లు సమాచారం.

# భారతీయ సంస్కృతి దారి తప్పకుండా చూడాలి

- ఉపాధ్యాయులు ఈ బాధ్యత తీసుకోవాలి
- కళ్ళు మూస్తే దైవం .. తెరిస్తే దేశం కనపడాలి
- ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్



**సత్తుపల్లి, డిసెంబర్ 21:** భారతీయ సంస్కృతి దారి తప్పకుండా చూడాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని ఆర్. ఎస్.ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ (కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్) భరత్ కుమార్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా"దేశ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర "అనే అంశంపై ఖమ్మం జిల్లాలోని విద్యా సంస్థల యాజమాన్యాల వారితో సమావేశము నిర్వహించారు.



ఆర్.ఎస్.ఎస్ ఖమ్మం జిల్లా సంఘచాలక్ లక్కినేని ప్రసాద్ అధ్యక్షతన భారతదేశ పునర్వైభవమే లక్ష్యంగా ఈ సమావేశంలో అవగాహన కల్పించారు. భరత్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులలో దేశభక్తి, జాతీయభావం పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. మన శరీరంలో అవయవాలు వేరైనా రక్తసంబంధం ఒకటే... అదేవిధంగా కులాలు, మతాలు వేరైనా ఇతరులను గౌరవించేటప్పుడు అందరూ ఒక్కటే అనే భావన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి మనిషికి కళ్ళు మూస్తే దైవం.. కళ్ళు తెరిస్తే దేశం కనిపించేలా దేశభక్తిని పెంచడం ద్వారా మన దేశం విశ్వ గురువుగా ఎదగాలని ఆకాంక్షించారు. నియమము ఉల్లంఘించనందున శ్రీరాముడు దేవుడు అయ్యాడని అని అన్నారు. జాతీయ జెండా, జాతీయ గీతం ఎలాగో మనం తీసుకునే ఆహారానికి, తాగే నీటికి కూడా అదే విధమైన గౌరవం ఇవ్వాలని సూచించారు. మన ప్రయత్నం విద్యార్థుల్లో మార్పు తెచ్చేలా ఉండాలని తద్వారా భారతదేశం ఒక పుణ్య ప్రదేశం కావాలని ఆకాంక్షించారు. పకృతి ధర్మం, కుటుంబం ధర్మం, సమాజ ధర్మం కాపాడుతూ జీవించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యాసంస్థల యాజమాన్యాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక పోరు ముగిసింది.. ప్రశాంతతే ప్రజల ఆకాంక్ష

- గెలుపు ఓటమి తాత్కాలికం.. గ్రామ బంధాలు శాశ్వతం
- కక్షలతో కాదు.. కర్తవ్యంతోనే అభివృద్ధి సాధ్యం
- కేసులు కాదు.. కలిసికట్టే భవిష్యత్తు

**స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి ముగిసిపోయింది. సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ఎంపికయ్యారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు తమ తీర్పు చెప్పారు. కానీ ఎన్నికల తర్వాత కూడా గ్రామాల్లో ఉద్రిక్తతలు, అనవసర గొడవలు, పరస్పర ఆరోపణలు కొనసాగడం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**



**భద్రాద్రి, డిసెంబర్ 21:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక గ్రామాల్లో ఎన్నికల ఫలితాల తర్వాత గెలిచినవారు–ఓడినవారిపై ప్రతాపం చూపించడం, ఓటు వేయలేదని నిందలు వేయడం, కక్షసాధింపులకు పాల్పడడం తగదని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. ఒకే గ్రామంలో, ఒకే వీధిలో, ఒకే బంధాలతో కలిసి జీవించాల్సిన మనుషులు ఎన్నికల పేరుతో శత్రువులుగా మారడం గ్రామ భవిష్యత్తుకే ప్రమాదమని అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచిన నాయకులు, ప్రమాణ స్వీకారం అనంతరం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముందడుగు వేయాల్సిందే తప్ప, అనవసర గొడవలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవడం ద్వారా తమ కుటుంబాలను, తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేయొద్దని గ్రామ పెద్దలు హితబోధ చేస్తున్నారు. న్యాయస్థానాల చుట్టూ తిరగడం వల్ల లాభం ఉండదని, చివరికి నష్టపోయేది కుటుంబాలేనని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఇక మరోవైపు, ఎన్నికల సమయంలో అడ్డగోలుగా ఖర్చుపెట్టి అప్పుల పాలైన అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ పరిస్థితుల్లో మరింత గొడవలు, కక్షలు గ్రామాలను రణరంగంగా మార్చుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీల కోసం నిబద్ధతతో కష్టపడిన కార్యకర్తలను గుర్తించి, వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత మండల స్థాయి నాయకత్వానిదేనని స్పష్టం చేస్తున్నారు. కార్యకర్తలను మోసం చేసే నాయకత్వం ఉంటే పార్టీల మనుగడకే ముప్పు ఏర్పడుతుందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. అనవసర దౌర్జన్యాలు, కేసులు, బెదిరింపుల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, రాజకీయాలు వస్తుంటాయి–పోతుంటాయి కానీ గ్రామాలు, ప్రజల జీవితం శాశ్వతమని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అందుకే గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, కక్షలకు తావు లేకుండా గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వ పథకాలు నిజంగా అర్హుల వరకు చేరేలా చూడాలి. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి గ్రామాన్ని ఒక్కటిగా ముందుకు నడిపించాలి. గొడవలకు ఆస్కారం లేకుండా, ప్రశాంతతతో, ఐక్యతతో జీవించాలన్నదే ప్రజల ఆకాంక్షగా మారింది. రాజకీయాలు క్షణికం.. ప్రజల ఐక్యత శాశ్వతం. గ్రామాల భవిష్యత్తు ప్రశాంతతలోనే ఉంది అని ప్రజలు వేడుకుంటున్నారు.

# గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ
- నూతన పంచాయతీ పాలకవర్గాలకి శుభాకాంక్షలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలంలో నూతనంగా ఎన్నికై,నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులకి పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివ ృద్ధే లక్ష్యంగా పాలక వర్గం పని చేయాలని కోరారు. మారుమూల గ్రామాలను, తండాలను అభివృద్ధి చేసే దృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గ ృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంకణ బద్ధులై ఉన్నారని తెలిపారు. ఇప్పటికే అత్యధిక నిధులను కేటాయించి,గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అంతర్గత సీసీ రోడ్లు,లింకు,బిటి రహదారులు,సైడ్ డ్రైనేజీలు మంజూరు చేయగా, నిర్మాణాలు ముగింపు దశకు చేరుకున్నాయని గుర్తు చేశారు. నూతన పాలకవర్గం పారదర్శకతతో సమిష్టిగాపని చేసి గ్రామాలను అభివ ృద్ధిలో ఆదర్శంగా నిలపాలని సూచించారు.



## పాలకవర్గం పారదర్శకంగా పని చేయాలి

### గ్రామ పెద్దలు కేశిరాజు లక్ష్మీ నరసింహారావు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం పారదర్శకంగా పని చేయాలని కూసుమంచి గ్రామ పెద్దలు కేశిరాజు లక్ష్మీ నరసింహారావు తెలిపారు. ఇటీవల వార్డు సభ్యులుగా ఎన్నికైన గుండా ఉపేందర్ రెడ్డి, అర్వపల్లి ఉపేందర్ ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహారావు వారికి శుభాకాంక్షలు తెలిపి,అభినందించారు. అనంతరం గ్రామాభివ ృద్ధిలో భాగంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, సలహా, సూచనలను ఆయనతో చర్చించారు. అదే విధంగా గ్రామంలో అపరిష్కృతంగా పేరుకుపోయిన పారిశుధ్య సమస్యలు ఒక్కొకటిగా పరిష్కరిస్తూ,విద్య,వైద్యం పై ప్రత్యేక ద ృష్టి సారించాలని పాలకవర్గానికి సూచించారు. ప్రధానంగా విద్యార్థులు,యువతను సన్మార్గం వైపు నడిచేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని,తన వంతుగా సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాల్లో సమన్వయంతో ముందుకెళ్తూ ఆదర్శ గ్రామంగా నిలపాలని తెలియజేశారు.

## నేషనల్ కౌన్సిల్ మెంబర్గా ఏకగ్రీవంగా ఎన్నికైన కందికొండ శ్రీనివాస్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ గా నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కం ఫోటోగ్రాఫర్ కందికొండ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాలుగో మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కందికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్గా బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. యూని యన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్గా రానున్న కాలంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో యూనియన్ బలోపేతానికి అవసరమైన కార్యాచరణను రూపొం దిస్తామని జర్నలిస్టులందరినీ ఐక్యం చేసి సమస్యల పరిష్కారానికి క ృషి చేస్తాన న్నారు. కందికొండ శ్రీనివాస్ నేషనల్ కౌన్సిల్ మెంబర్గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల నేలకొండపల్లి మండలంలోని వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టు సోదరులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, జక్కంపూడి కృష్ణ, అంజయ్య, బైరం ప్రసాదరావు, మారేపల్లి రామదాసు, మైస శ్రీనివాసరావు, సంజయ్ ఆదాం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.



## డాక్టర్ నీరజ ఫెర్టిలిటి హాస్పిటల్‌ను ప్రారంభించిన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ శ్రీరామ్ నగర్ బి బ్లాక్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ నీరజ ఫెర్టిలిటీ హాస్పిటల్‌ను శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి పాల్గొని ప్రారంభించిన పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నీరజ,కిరణ్, నాయకులు చాంద్ పాషా, అనిల్ యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, పవన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఫిట్‌నెస్‌కు సైక్లింగ్ ఉత్తమ మార్గం

### జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 21:** కేంద్ర ప్రభుత్వం మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమలవుతున్న ఫిట్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో "ఫిట్ ఇండియా – సన్‌డే సైక్లింగ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు కొత్తగూడెం పట్టణంలో సన్‌డే సైక్లింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా విజయవంతం చేశారని అన్నారు. సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడం, అలాగే ఫిట్ ఇండియా మిషన్‌లో భాగంగా సైక్లింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ బీవీజీ కృష్ణ, నాగేశ్వర్ రావు, ఉదయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు కవిత, శైలజ, కాంచనపల్లి స్పోర్ట్స్ స్కూల్ హెడ్‌మాస్టర్, తదితరులు పాల్గొన్నారని తెలిపారు.



## కమ్యూనిస్టు ఉద్యమ గుణపాఠాలతో ముందుకు సాగాలి

- వందేళ్ల ఉద్యమ అనుభవం నుంచి నేర్చుకోవాలి
- లోటుపాట్లను స్వీకరించి ప్రజాపంథాలో పోరాటం అవసరం
- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి పిలుపు

**జూలూరుపాడు, డిసెంబర్ 21:** భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి వందేళ్లు పూర్తైన సందర్భంగా, ఉద్యమంలో జరిగిన లోటుపాట్లను నిజాయితీగా అవగాహన చేసుకుని ప్రజాపంథాలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి పిలుపునిచ్చారు. జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం – గుణపాఠాలు – కర్తవ్యాలు" అనే అంశంపై జరిగిన జిల్లా అవగాహన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. ఈ సదస్సుకు జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు అధ్యక్షత వహించారు. 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపన జరిగిందని, నూరేళ్ల ఉద్యమ చరిత్ర పోరాటాలు, త్యాగాలు, విజయాలతో నిండి ఉందని రంగా రెడ్డి గుర్తు చేశారు. కార్మికులు, రైతులు, పీడిత వర్గాల కోసం సాగిన పోరాటాలు దేశవ్యాప్తంగా ఉద్యమ చైతన్యాన్ని తీసుకువచ్చాయని తెలిపారు. అయితే కొన్ని కీలక సందర్భాల్లో తప్పటడుగులు, మితవాద–అతివాద ధోరణులు ఉద్యమానికి నష్టం చేశాయని, ఆ అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేటి పెట్టుబడిదారీ, కార్పొరేట్ పాలనలో ప్రజల పక్షాన నిలిచే బలమైన ఐక్య విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం అత్యవసరమని స్పష్టం చేశారు. మతోన్మాద ఫాసిజం, కుల అణచివేతలు, అన్ని రకాల దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేస్తూ ఉద్యమాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పార్టీ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, కెచ్చల కల్పన, జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం తదితరులు ప్రసంగించగా, జిల్లా నాయకులు, సర్పంచులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందేలా చూస్తా : ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, డిసెంబర్ 21:** ఆదివారం హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాల అనారోగ్య బాధితులు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, బాధితులకు భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరాలని ఆకాంక్షించారు. అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం తనకు అత్యంత ప్రాధాన్యమని అవసరమైన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండటమే తన బాధ్యతని తెలిపారు.



## చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఉపకార వేతనాలు అందచేత

**దమ్మపేట, డిసెంబర్ 21:** ఆదివారం కమ్మ సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అరికెపూడి గాంధీ, తాళ్లూరి జీవన్ ఆధ్వర్యంలో చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్, దమ్మపేట, మందలపల్లి సంఘాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రోత్సాహంగా ఒక్కొక్కరికి పదివేలు చొప్పున ఈలప్రోలు ఈశ్వర సాయిరాం, దమ్మపేట, మేకా భార్గవ్, దమ్మపేట, మల్లెపల్లి చందన్, సుధా పల్లి, వల్లభనేని సాహితీ, రెడ్యాలపాడుల, పునుకొల్లు రిషిత, దమ్మపేట లకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోతినేని శ్రీరామ వెంకటరావు, గడ్డిపాటి సత్యం, వజ్జా శ్రీనివాసరావు, అల్లాడ రమాదేవి, కొంకా శ్రీనివాసరావు, యలమర్తి కిషోర్ కుమార్, బొల్లా మోహన్ రావు, పెనికెలపాటి కృష్ణయ్య, పెనికలపాటి హరినాయుడు పారుపల్లి భద్రం, తూమాటి మల్లేశ్వరరావు, పారుపల్లి రజిని, ఈలప్రోలు కిరణ్ బాబు, యర్ర వసంతం పాల్గొన్నారు.

## తదుపరి ఎస్ఐఆర్ తెలంగాణలోనే..

### సీఈసీ జ్ఞానేశ్‌కుమార్




**హైదరాబాద్:** బిహార్‌లో బీఎల్‌వోలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను విజయవంతంగా నిర్వహించి దేశానికి మార్గదర్శనం చేశారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. తెలిపారు. తదుపరి అదే పక్రియ తెలంగాణలో అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించారు. ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి భారత కేంద్ర ఎన్నికల సంఘం ఎదిగిందని.. రాబోయే ఒక సంవత్సరం పాటు అంతర్జాతీయ 'ఇంటర్నేషనల్ ఐడియా' సంస్థకు కేంద్ర ఎన్నికల కమిషనరే నాయకత్వం వహించనున్నారని వెల్లడించారు. కెనడా దేశం కంటే తెలంగాణలోనే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారని, .అంత పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్న రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత లపై ఉందని తెలిపారు. దేశంలో ఎన్నికల నిర్వహణ కోసం 1.80 కోట్ల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల యంత్రాంగమని పేర్కొన్నారు. బిహార్‌లో ఎన్నికలను 7 దేశాల నుంచి వచ్చిన 20 మంది ప్రతినిధులు పరిశీలించారని, అంతర్జాతీయంగా భారత ఎన్నికల వ్యవస్థకు గుర్తింపు లభించిందని చెప్పారు. ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత 7.5 కోట్ల ఓటర్లతో జాబితా విడుదల చేశామని, ఈ ప్రక్రియపై ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని తెలిపారు. ఎన్నికల అనంతరం రికౌంటింగ్ విషయంలో కూడా సున్నా ఫిర్యాదులే వచ్చాయని, దానికి కారణంల సమర్ధ పనితీరేనని ప్రశంసించారు. తెలంగాణలోఒక బీఎల్ఓకి సగటున 930 మంది ఓటర్లు ఉన్నారని..ఎస్ఐఆర్ సమయంలో చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు వంటి లోపాలు బయటపడతాయన్నారు. అలాంటి లోపాలను సరిచేయడానికే అవసరమని వివరించారు. దేశ రాజ్యాంగానికి అతిపెద్ద సైనికులు బూత్ లెవెల్ ఆఫీసర్లేనని.. ప్రస్తుతం దేశంలో 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ కొనసాగుతోందని, భవిష్యత్తులో మిగతా రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణలో ను అందరం కలిసి విజయవంతం చేద్దాం అంటూ బీఎల్ఓలకు జ్ఞానేశ్ కుమార్ పిలుపునిచ్చారు.

## క్రీడాకారుల విజయాలు జిల్లాకు గర్వకారణం

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 21:** క్రీడాకారులు సాధించిన పథకాలు విజయాలు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పాల్వంచ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించిన జిల్లా క్రీడాకారులను ఘనంగా అభినందించారు. పాల్వంచ మినీ స్టేడియంలో నిరంతరం సాధన చేస్తూ చాంపియన్‌షిప్ స్థాయి విజయాలు సాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈచాంపియన్‌షిప్‌లో ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని విజయాలు సాధించడం ప్రత్యేకంగా హర్షణీయమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ శ్వేతతో పాటు విజయం సాధించిన విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అథ్లెటిక్స్‌లో క్రీడాకారులను శిక్షణనిచ్చి తీర్చిదిద్దుతున్న అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, సెక్రటరీ మహిధర్‌లకు కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గిరిజన విద్యార్థినుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీస్తూ వారికి సరైన మార్గనిర్దేశం అందిస్తున్న అధ్యాపకులు, అధికారుల కృషి ప్రశంసనీయమని ఆయన అన్నారు. వారి నిరంతర కృషి ఫలితంగానే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, విశ్వవిద్యాలయ స్థాయిలో క్రీడాకారులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. పాల్వంచ మినీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ టెన్నిస్ రాష్ట్రస్థాయి మీట్‌లో పాల్గొన్న క్రీడాకారులను కూడా జిల్లా కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చూపించడం భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలకు దారితీస్తుందని అన్నారు. టెన్నిస్ సీనియర్ ప్లేయర్ అన్నం వెంకటేశ్వర్లు జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో విజయం సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావడం గర్వకారణమని పేర్కొంటూ కలెక్టర్ ఆయనను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ విజయం యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, క్రీడల్లో ప్రతిభ కనబరిచే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామరెడ్డి, విద్యార్థులు, క్రీడాకారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎంజిఎన్‌ఆర్‌ఇజిప పేరు మార్పు అంగీకరించం

- దమ్మపేట మండల కాంగ్రెస్ కమిటీ
- పథకాల పేర్లు మార్చితే ప్రజల ఆకలి తీరదు
- డా.మన్మోహన్ సింగ్ సంక్షేమ పథకాన్ని కించపరిచే ప్రయత్నం
- కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలో నిరసన

**దమ్మపేట, డిసెంబర్ 21:** ఆదివారం దమ్మపేట మండల కేంద్రంలో ఏఐసీసీ,టిపిసిసి, డిసిసి ల పిలుపుమేరకు, అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు బిజెపి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకాన్ని (ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎ) రద్దు చేస్తూ పేరు మార్చి (వి బి జి రామ్ జి) అనే పేరుతో నామకరణం చేసి కొత్త బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంట్లో ఆమోదించడంపై వ్యతిరేకిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మహాత్మా గాంధీ విగ్రహానికి మండల కాంగ్రెస్ శ్రేణులు పత్రం అందచేశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్ మాట్లాడుతూ కోట్లాది గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించిన ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎ సంక్షేమ పథకం పేరును రాజకీయ స్వార్థం కోసం మార్చడంపై బిజెపి కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకిస్తూ ఈరోజు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం నిర్వహించి నిరసనలు చేపట్టామని తెలిపారు. జాతిపిత ఆయన మహాత్మా గాంధీ పేరు తొలగింపు, అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేయడం, దివంగత నేత డాక్టర్ మన్మోహన్ సింగ్ సంక్షేమ పథకాన్ని కించపరిచే ప్రయత్నం చేయడంపై అది ప్రజా వ్యతిరేక చర్య అని ఖండించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార అహంకారంతో ప్రజలను మభ్యపెడుతూ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టాలని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రజల హక్కులు, సంక్షేమ పథకాలను కాపాడేందుకు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండి కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళలు యువకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీల అమలు పట్టించుకున్నారా?

### సోనియాకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్:** తెలంగాణలో స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీలు, మేనిఫెస్టో అమలు గురించి ఏనాడైనా తెలుసుకునేందుకు ప్రయత్నించారా? అని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కనీసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి ఆరా తీశారా? అంటూ ఓ బహిరంగ లేఖ రాశారు. "ఆనాడు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టి.. మళ్లీ ఇప్పుడు విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు ఇస్తున్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేశారా? ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా? గాంధీభవన్‌లో పాతరేశారా? తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి. ఇప్పటికైనా కొత్త ఊహలు, కొత్త ఆశలు, కొత్త హామీలు కల్పించే ముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే మీరు ప్రయోగించిన అభయహస్తమే ప్రజల ఆగ్రహం రూపంలో మీ పాలిట భస్మాసుర హస్తమై అధికారానికి దూరం చేస్తుంది. తెలంగాణ ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారు" అని కిషన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.



## మాట నిలబెట్టుకున్న మాడి ముత్యాలరావు

### ఓడినా చర్చికి సౌండ్ బాక్స్ అందజేత
### ప్రజలకు సేవే నిజమైన నాయకత్వం

**అశ్వారావుపేట, డిసెంబర్ 21:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే అసలైన నాయకత్వమని అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మాడి ముత్యాలరావు మరోసారి నిరూపించారు. సర్పంచ్ ఎన్నికల ప్రచార సమయంలో స్థానిక యేసుక్రీస్తు మందిరానికి సౌండ్ బాక్స్ అందిస్తానని హామీ ఇచ్చిన ముత్యాలరావు, ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ఆ మాటను నిలబెట్టుకున్నారు. పదవిలో లేకున్నా ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో తన సొంత ఖర్చులతో సౌండ్ బాక్స్‌ను చర్చి కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు. ఎన్నికల తర్వాత హామీలను మరిచిపోతున్న నేతల మధ్య, ఓడినా ఇచ్చిన మాట ప్రకారం సహాయం చేయడం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఉదయ్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ గెజిట్‌తో గ్రామాలకు కొత్త నాయకత్వం

- సోమవారం ప్రమాణస్వీకారం
- అధికారుల సమక్షంలో వేడుకలు
- మండలమంతా పండుగ వాతావరణం

**అశ్వారావుపేట, డిసెంబర్ 21:** ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారానికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేయడంతో అశ్వారావుపేట మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో హడావుడి మొదలైంది. "నువ్వా నేనా" అన్నట్టుగా సాగిన ఉత్కంఠభరిత ఎన్నికల పోరాటంలో విజయం సాధించిన ప్రజాప్రతినిధులు అధికారికంగా బాధ్యతలు స్వీకరించేందుకు ప్రభుత్వం సోమవారం రోజును ముహూర్తంగా ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమాల ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. అధికారుల పర్యవేక్షణలో, నిబంధనల ప్రకారం నూతన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గ్రామాలన్నీ పూల అలంకరణలు, వేదికల ఏర్పాటు, ప్రజల రాకపోకల సౌకర్యాలతో సందడిగా మారాయి. ఎన్నికల అనంతరం నెలకొన్న ఉత్కంఠకు ముగింపు పలుకుతూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో మరో కీలక ఘట్టంగా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిలవనున్నాయి. అనేక గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొనగా, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా జోరుగా సాగుతున్న ఈ ఏర్పాట్లు గ్రామపాలనలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి.

నేటి కాలంలో మన ఆహారపు అలవాట్లల్లో, జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో మనలో చాలా మంది ఊబకాయం, అధిక బరువు ముఖ్యంగా పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరిలో శరీరం సన్నగా ఉన్నప్పటికీ పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. సమతుల్య ఆహారాన్ని తీసుకోకపోవడం, వ్యాయామం చేయకపోవడం, ఉప్పు, నూనె కలిగిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం, ఒత్తిడి, నిద్రలేమి వంటి వివిధ కారణాల వల్ల పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల అధిక రక్తపోటు, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది. అయితే కొన్ని రకాల ఇంటి చిట్కాలను ఉపయోగించి మనం చాలా సులభంగా పొట్ట చుట్టూ చేరిన కొవ్వును తొలగించుకోవచ్చు. ఈ చిట్కాలను పాటించడం కూడా చాలా సులభం.



# పొట్ట చుట్టూ చేరిన కొవ్వును కరిగించుకోవడం ఎలా..?

## ఆహారాలు..

ప్రతిరోజూ 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల పొట్ట చుట్టూ చేరిన కొవ్వు తొలగిపోతుంది. శారీరక వ్యాయామం చేయడం వల్ల కొవ్వు కరగడంతోపాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువులు ఎత్తడం, సిట్ అప్స్, క్రంచెస్ వంటివి చేయడం వల్ల పొట్ట చుట్టూ చేరిన కొవ్వు కరిగిపోతుంది. సమతుల్య ఆహారం కూడా కొవ్వును కరిగించడంలో మనకు ఎంతో సహాయపడుతుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి. ఉప్పు, చక్కెర, నూనెలో వేయించిన పదార్థాలు, కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న పదార్థాలను తక్కువగా తీసుకోవాలి. కొవ్వును తగ్గించడంలో మిరపకాయలు ఎంతో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఆహారంలో భాగంగా తగిన మోతాదులో మిరపకాయలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



## అల్లం, పసుపు..

అల్లాన్ని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరుగుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నిల్వలు తగ్గుతాయి. తద్వారా పొట్ట చుట్టూ చేరిన కొవ్వు కూడా తగ్గుతుంది. శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. పసుపులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్న సంగతి మనకు తెలిసిందే. శరీర బరువును తగ్గించడంలో, కొవ్వును కరిగించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. రోజూ ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో పసుపు కలిపి తీసుకోవడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు వేగంగా కరుగుతుంది. మన వంటగదిలో ఉండే దినుసులల్లో జీలకర్ర కూడా ఒకటి. జీలకర్ర అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఆహారంలో జీలకర్రను భాగంగా చేసుకోవడంతోపాటు జీలకర్ర కషాయాన్ని తాగడం వల్ల అధిక బరువుతో బాధపడే వారు మంచి ఫలితాలను చూడవచ్చు.

## నిమ్మరసం..



శరీరంలో జీవక్రియ వేగాన్ని పెంచడంలో నిమ్మకాయ మనకు ఎంతో ఉపయోగపడుతుంది. రోజూ ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో నిమ్మరసాన్ని కలిపి తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరుగుతుంది. పొట్ట చుట్టూ చేరిన కొవ్వును కరిగించడంలో గ్రీన్ టీ ఎంతో సహాయపడుతుంది. టీ, కాఫీలకు బదులుగా రోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల శరీర బరువు అదుపులో ఉండడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. అలాగే ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి కారణంగా కూడా శరీర బరువు పెరుగుతుందన్న సంగతి మనకు తెలిసిందే. యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత పెరుగుతుంది. తద్వారా బరువు అదుపులో ఉంటుంది. ఈవిధంగా ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ చక్కటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల పొట్ట చుట్టూ చేరిన కొవ్వును చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. ఇలా చేయడం వల్ల శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.



## ఇది ఇషాన్‌కు క్రికెట్ నుంచి లభించిన బహుమతి : అశ్విన్

క్రికెట్‌ను ఇషాన్ కిషన్ గౌరవించాడని.. అది అతడికి బహుమతి ఇచ్చిందని టీమ్ ఇండియా మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్లో వ్యాఖ్యానించాడు. ఇషాన్ పునరాగమనాన్ని ఆయన విశ్లేషించాడు. "ఇది ఇషాన్ కిషన్‌కు క్రికెట్ ఇచ్చిన గిఫ్ట్. చాలా మంది బయట నుంచి రకరకాలుగా ఊహించుకోవచ్చు. మరికొందరు ఇది అన్యాయం అని కూడా చెప్పొచ్చు. కానీ, జీవిత చక్రం తిరిగి అక్కడికే వచ్చింది. అతడు జట్టులో స్థానం కోల్పోవడానికి.. జట్టులోకి తిరిగి రావడానికి ఒకే కారణం ఉంది. అతడు క్రికెట్‌కు ఇవ్వాల్సినంత గౌరవం ఇచ్చాడు. ఇషాన్ బుచ్చిబాబు ట్రోఫీ ఆడాడు. ఆ టోర్నమెంట్‌లో చెన్నైకి వచ్చి ఝార్ఖండ్ జట్టుకు నాయకత్వం వహించాడు. రంజీ ట్రోఫీ ప్రిపరేషన్‌లో ఆ జట్టులో నంబర్ వన్ ఆటగాడిగా నిలిచాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పరుగుల వరద పారించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్‌లో జట్టును విజయపథంలో నడిపించాడు. ఆ టోర్నమెంట్‌లో అద్భుతంగా ఆడాడు. ఇషాన్ శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు. ఆటను గౌరవించి.. విజయం సాధించాడు. నువ్వు పెద్ద ఆటగాడివా, చిన్న ఆటగాడివా.. కొత్తగా వచ్చావా.. అన్నది కాదు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రాణించు.. మా కళ్లు ఎప్పుడూ మీపై ఉంటాయి అనే సందేశాన్ని సెలక్టర్లు కూడా ప్లేయర్లకు బలంగా పంపారు. వన్డేల్లో ఇషాన్ డబుల్ సెంచరీ చేసిన తీరే అతడేంటో చెబుతోంది" అని అశ్విన్ పేర్కొన్నాడు.

## ప్రపంచకప్‌నకు సిద్ధమవుతున్న గిల్‌కు ముందే చెప్పారు

టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్ జట్టులో శుభ్‌మన్ గిల్‌కు స్థానం దక్కకపోవడం చాలా మంది క్రికెట్ పండితులు ఊహించలేదు. గిల్ కూడా న్యూజిలాండ్ సిరీస్, ప్రపంచకప్‌లో ఆడేందుకు సన్నాహాలు చేసుకుంటున్న వేళ బీసీసీఐ నిర్ణయం వెలువడింది. వాస్తవానికి కుడి పాదానికి గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి రెండు టీ20లకు కూడా జట్టులో స్థానం కోల్పోయాడు. గిల్ శనివారం అహ్మదాబాద్‌ను వీడి చండీగఢ్‌కు బయల్దేరిన సమయంలో సెలక్షన్ కమిటీ భేటీ జరిగింది. జట్టును ప్రకటించడానికి కొద్దిసేపటి ముందే బీసీసీఐ నుంచి శనివారం మధ్యాహ్నం గిల్‌కు ఫోన్ చేసి.. తప్పించిన విషయాన్ని చెప్పారు. ఈ విషయాన్ని క్రిక్‌బజ్ కథనంలో పేర్కొంది. అయితే గిల్‌కు ఎవరు ఈ విషయం తెలిపారనే అంశం మాత్రం బయటకు రాలేదు. గిల్ తొలుత గాయంతోనూ దక్షిణాఫ్రికాతో టీ20 ఆడేందుకు సిద్ధపడ్డాడు. కానీ, మైదానంలోకి దిగితే అది మరింత తీవ్రమై కీలక టోర్నమెంట్లకు దూరం కావాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరించడంతో వెనక్కి తగ్గాడు. ఆ తర్వాతే బీసీసీఐ కూడా అతడికి గాయమైన విషయాన్ని ధ్రువీకరించింది. లఖ్‌నవూలో డిసెంబర్ 16న నెట్‌ప్రాక్టీస్ సమయంలో గాయపడ్డాడు. దీంతో జట్టులో ఆడేందుకు సంజుకు అవకాశం లభించింది. అతడే అభిషేక్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. గిల్ టీ20 జట్టులోకి ఆసియాకప్ సందర్భంగా పునరాగమనం చేశాడు. అతడు మొత్తం 15 మ్యాచ్‌లు ఆడి కేవలం 291 పరుగులు మాత్రమే చేయడం విమర్శలకు దారితీసింది. టీ20 ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన స్ట్రైక్‌రేట్ కూడా ఆశించిన స్థాయి-ంలో లేదు. ఈ క్రమంలో సెలక్టర్లు అతడిని పక్కనపెట్టడానికే మొగ్గుచూపారు. దీంతో గిల్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌పై తన దృష్టిని సారించనున్నాడు. విజయ్ హజారే టోర్నమెంట్‌లో పంజాబ్ తరఫున ఆడనున్నాడు.



## అండర్-19 ఆసియా కప్ ఫైనల్
### పాకిస్థాన్‌తో భారత్ ఓటమి



**దుబాయి:** అండర్-19 ఆసియా కప్ 2025లో ఓటమి అనేదే లేకుండా ఫైనల్‌కు చేరిన యువ భారత్.. కీలక పోరులో తడబడింది. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో భారత కుర్రాళ్లు అన్ని రంగాల్లో నిరాశపర్చారు. ఫలితంగా భారత్ 191 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. 348 పరుగుల భారీ లక్ష్యఛేదనలో టీమ్ఇండియా 26.2 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌటైంది. పదో స్థానంలో వచ్చిన దీపేశ్ దేవేంద్రన్ (36) టాప్ స్కోరర్‌గా నిలవడం విశేషం. ఒక దశలో 120 పరుగులకే భారత్ తొమ్మిది వికెట్లు కోల్పోగా.. దీపేశ్ పోరాటంతో స్కోరు 150 దాటింది. వైభవ్ సూర్యవంశీ (26), ఖిలాన్ పటేల్ (19), ఆరోన్ జార్జ్ (16), అభిజ్ఞాన్ కుందు (13), వేదాంత్ త్రివేది (9), కాన్షిక్ చౌహాన్ (9), విహాన్ మల్హోత్రా (7), హెనిల్ పటేల్ (6), ఆయుష్ మాత్రే (2), కిషన్ కుమార్ సింగ్ (3) పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో అలీ రజా 4, మహ్మద్ సయామ్, అబ్దుల్ సుభాన్, హుజైఫా అహ్సన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ (172, 113 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సులు) భారీ శతకం చేశాడు. అహ్మద్ హుస్సేన్ (56, 72 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేశాడు. ఉస్మాన్ ఖాన్ (35), ఫర్హాన్ యూసుఫ్ (19), హంజా జహూర్ (18) పరుగులు చేశారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 3, హెనిల్ పటేల్ 2, ఖిలాన్ పటేల్ 2, కాన్షిక్ చౌహాన్ ఒక వికెట్ తీశారు.



## మెస్సికి రూ.89 కోట్లు

**కోల్‌కతా:** భారత్‌లో మూడు రోజులు పర్యటించినందుకు ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సి రూ.89 కోట్లు అందుకున్నాడట. ఈ విషయాన్ని ఈవెంట్ మేనేజర్ శతద్రు దత్తా వెల్లడించాడు. "మెస్సికి రూ.89 కోట్లు చెల్లించాం. ప్రభుత్వానికి రూ.11 కోట్ల పన్ను కట్టాం. మొత్తం ఖర్చు రూ.100 కోట్లు. ఇందులో 30 శాతం స్పాన్సర్ల నుంచి వచ్చింది. టికెట్ల అమ్మకాల ద్వారా మరో 30 శాతం లభించింది" అని కోల్‌కతా స్టేడియంలో మెస్సి ఈవెంట్ గందరగోళంగా మారడంపై విచారణ జరుపుతున్న అధికారులకు దత్తా చెప్పినట్లు సమాచారం. సాల్ట్‌లేక్ స్టేడియంలో కొందరు తనను హత్తుకోవడం మెస్సికి నచ్చలేదని అతడు తెలిపాడు. మెస్సి సరిగా కనపడకపోవడం, అతడు 22 నిమిషాల్లోనే స్టేడియాన్ని వీడడంతో ఆగ్రహించిన ప్రేక్షకులు విధ్వంసానికి పాల్పడ్డ సంగతి తెలిసిందే.

# వరుసగా మూడో విజయం

## యాషెస్ సిరీస్ ఆస్ట్రేలియా వశం

**అడిలైడ్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా హవా కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలుపొందిన కంగారూలు.. అడిలైడ్ జరిగిన మూడో టెస్టులోనూ విజయకేతనం ఎగరవేశారు. ఇంగ్లాండ్‌ను 82 పరుగుల తేడాతో ఓడించి రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకున్నారు. 435 పరుగుల లక్ష్యఛేదనలో.. 207/6తో ఐదో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్.. 352 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు బ్యాటర్లలో ఓపెనర్ జాక్ క్రాలీ (85), జెమీ స్మిత్ (60), విల్ జాక్స్ (47) రాణించారు. జో రూట్ (39), బ్రైడన్ కార్స్ (39ని), హ్యారీ బ్రూక్ (30) పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3, పాట్ కమిన్స్ 3, నాథన్ లైయన్ 3, స్కాట్ బోలాండ్ ఒక వికెట్ పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 271/4తో శనివారం ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియా 349 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 311/4తో బలమైన స్థితిలో ఉన్న కంగారూ జట్టు 38 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు చేజార్చుకుంది. మూడో రోజు సెంచరీ చేసిన ట్రావిస్ హెడ్ (170, 219 బంతుల్లో 16(4), 2(6)).. ఓవర్‌నైట్ స్కోరుకు 28 పరుగులు జత చేసి ఔటయ్యాడు. అతడు వెనుదిరిగాక.. ఆసీస్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. జోష్ టంగ్ (4/70), బ్రైడన్ కార్స్ (3/80) ఆస్ట్రేలియాను కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 371.. ఇంగ్లాండ్ 286 పరుగులు చేశాయి. ఆస్ట్రేలియా బ్యాటర్ అలెక్స్ కేరీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కేరీ ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 106, రెండో ఇన్నింగ్స్‌లో 72 పరుగులు చేశాడు. నాలుగో టెస్టు డిసెంబరు 26న మెల్‌బోర్న్ వేదికగా ప్రారంభంకానుంది.




# శ్రీలంకతో తొలి టీ20లో భారత్ ఘనవిజయం

**విశాఖపట్నం:** సొంతగడ్డపై శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌ను భారత జట్టు ఘనవిజయంతో ఆరంభించింది. ప్రపంచకప్‌లో కలిసి రాని విశాఖపట్నం వేదిక.. ఈ మ్యాచ్‌లో మాత్రం భారత అమ్మాయిలకు పూర్తి అనుకూలంగా మారింది. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థికి కళ్లెం వేస్తే.. ప్రపంచకప్ ఫామ్‌ను కొనసాగిస్తూ జెమీమా రోడ్రిగ్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ అలవోకగా విజయాన్నందుకుంది. బంతితో, బ్యాటుతో అదరగొట్టిన భారత మహిళల జట్టు శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌ను ఘనంగా ఆరంభించింది. తొలి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. మొదట బౌలర్లు సమష్టిగా రాణించడంతో శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 121 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ విష్మి గుణరత్నె (39, 43 బంతుల్లో 1x4, 1x6) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేసింది. ఆ జట్టులో ముగ్గురు బ్యాటర్లు రనౌటయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ (4-1-20-1) గొప్పగా బౌలింగ్ చేసింది. క్రాంతి గౌడ్, శ్రీ చరణి తలో వికెట్ తీశారు. అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్ 44 బంతుల్లో 10x4) చెలరేగడంతో భారత్ 14.4 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రెండో టీ20 కూడా విశాఖపట్నంలోనే మంగళవారం జరుగుతుంది.

### అటు తడబాటు.. ఇటు ధనాధన్

శ్రీలంక, భారత్ ఇన్నింగ్స్‌లు పూర్తి భిన్నంగా సాగాయి. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన లంక.. ఆద్యంతం తడబడింది. 3 ఫోర్లు కొట్టి ఊపుమీద కనిపించిన కెప్టెన్ చమరి ఆటపట్టు (15)ను క్రాంతి బౌల్డ్ చేయడంతో లంక కష్టాలు మొదలయ్యాయి. ఓ ఎండ్‌లో విష్మి నిలబడ్డా.. ఆశించినంత వేగంగా ఆడలేకపోయింది. విష్మితో హసిని పెరీరా (20), హర్షిత సమరవిక్రమ (21) భాగస్వామ్యాలు నెలకొల్పినప్పటికీ.. వీళ్లిద్దరూ కూడా వేగంగా ఆడలేకపోయారు. బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తుంటే.. ఫీల్డర్లూ రాణించడంతో లంక పరుగుల కోసం చెమటోడ్చక తప్పలేదు. ఇన్నింగ్స్ ముందుకు సాగేకొద్దీ లంక కష్టాలు పెరిగాయి. చివరి ఓవర్లలోనూ స్కోరు వేగం పెరగలేదు. అనంతరం ఛేదనలో బంతికో పరుగు చొప్పున చేయాల్సిన భారత్.. ఆరంభంలోనే షెఫాలి (9) వికెట్ కోల్పోయినప్పటికీ, ఇబ్బంది పడలేదు. జెమీమా వచ్చీ రాగానే బ్యాటుకు పని చెప్పింది. అలవోకగా బౌండరీలు బాదింది. స్మృతి మంధాన (25)తో రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించిన ఆమె.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (15 నాటౌట్)తో అభేద్యమైన మూడో వికెట్‌కు 55 పరుగులు జోడించి జట్టుకు తిరుగులేని విజయాన్నందించింది. భారత్ 32 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.




MOVIE TIME CINEMA
www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక



## ‘కాంచన-4’లో మీరా రాజ్

తన అందం, అభినయంతో కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తున్న బ్యూటీ మీరా రాజ్. చిన్న వయసులోనే సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె, తొలి చిత్రంతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనలోనూ తనకంటూ ప్రత్యేక ఫేమ్ సంపాదించుకుంటూ రైజింగ్ స్టార్‌గా మారిపోయింది. అంతేకాకుండా సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌ను పెంచుకుంటూ ఉంటుంది. అతి తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో చెరగని ముద్ర వేసుకుని క్రేజీ బ్యూటీగా కొనసాగుతోంది. ఇక ఇటీవల మీరా రాజ్ నటించిన ‘సన్‌ఆఫ్’ చిత్రం మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. ఉత్తరాది నుంచి వచ్చినప్పటికీ ఈ సినిమా కోసం స్వయంగా తెలుగులో డబ్బింగ్ చెప్పుకోవడంతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, మీరా రాజ్ ఓ గుడ్ న్యూస్ వెల్లడించింది. ‘కాంచన-4’ దర్శకత్వంలో రాబోతున్న ఈ ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో మీరాకు కీలక పాత్రలో కనిపించనుంది.




## ‘వారణాసి’ బడ్జెట్ రూ.1300 కోట్లా?

### : ప్రియాంకా చోప్రా ఏమన్నారంటే

రాజమౌళి తెరకెక్కించే సినిమాల నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తారో.. ఆయా చిత్రాల బడ్జెట్ ఎంతో తెలుసుకునేందుకు అంతే ఆసక్తి చూపిస్తుంటారు. మహేశ్ బాబు హీరోగా ఆయన తెరకెక్కిస్తున్న ‘వారణాసి’ విషయంలోనూ అదే పరిస్థితి. ఈ క్రమంలోనే రూ.1300 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుందంటూ ప్రచారం జరిగింది. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ‘ది కపిల్ శర్మ షో’లో కపిల్ శర్మ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అతిథిగా హాజరైన ప్రియాంకా చోప్రాను అడగ్గా.. దానికి సమాధానంగా ఆమె నవ్వులు చిందించారు. ‘మీరు ఈ ప్రాజెక్టులో జాయిన్ అయిన తర్వాతే బడ్జెట్ పెరిగిందట. నిజమేనా?’ అంటూ కపిల్ సరదాగా ప్రశ్నించగా.. “అందులో సగం నా బ్యాంకు ఖాతాలోకి వెళ్లిందనేది మీ ఉద్దేశమా?” అని చమత్కరించారు. ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో మహేశ్ రుద్రగా నటిస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని సన్నివేశాల్లో రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక, కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఈ సినిమాని రాజమౌళి ఏయే అంశాలతో తెరకెక్కిస్తున్నారనేది ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్ తెలియజేసింది. అప్పటి వరకూ ఉన్న అంచనాలను అది మరింత పెంచేసింది. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలన్నది రాజమౌళి ప్లాన్.



## స్టైలిష్ లుక్‌లో బేబమ్మా

‘ఉప్పెన’ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన కృతి శెట్టి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ సినిమాతోనే బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో నిలిచిపోయింది. దీంతో ఈ క్యూట్ హీరోయిన్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా చాలా సినిమాల్లో నటించినా ఉప్పెన లాంటి హిట్ అయితే రాలేదు. దీంతో కొన్ని రోజులు తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది. ప్రజెంట్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా నటిస్తున్న ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ మూవీలో నటిస్తున్న ఈ చిన్నది.. రీసెంట్‌గా స్టార్ హీరో కార్తి నటించిన ‘అన్నగారు వస్తారు’ మూవీతో మన ముందుకు వచ్చింది. నలన్ కుమార స్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియాలో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్‌స్టా అకౌంట్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో వేరే వేరే డ్రెస్సులో మిర్రర్(అద్దం) ముందు తీసుకున్న సెల్ఫీలు ఉన్నాయి. ఇక వాటిని షేర్ చేస్తూ.. ‘నవంబర్ నెలలో తీసుకున్న కొన్ని ఫొటోలు’ అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు అద్దమే నిన్ను చూసి అసూయ పడేలా ఉన్నావు బేబమ్మా అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com